కన్నీరే మిగిలే!

- అకాల వర్షానికి తడిసిన ధాన్యం
- మూడు రోజులుగా ఈదురు గాలులతో కూడిన వానలతో రైతులు బెంబేలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



వనపర్తి మార్కెట్‌యార్డు ఎదుట వర్షపు నీటితో తడిసిన ధాన్యం

వనపర్తి: జిల్లాలో శనివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డుతో పాటు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం రాశులు తడిసిపోయాయి. రాశులపై టార్పాలిన్లు కప్పినా.. అడుగు భాగాన ఉన్న ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. వనపర్తి మార్కెట్ యార్డులో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోందన్నారు. మార్కెట్‌యార్డుతో పాటు ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ చేసిన వరి ధాన్యం వర్షపు నీటికి పూర్తిగా తడిసిపోయింది.

పాన్‌గల్: మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంతో పాటు రేమద్దుల, శాగాపూర్, మాందాపూర్, చింతకుంట, దావాజిపల్లి, కేతేపల్లి, బుసిరెడ్డిపల్లి, అన్నారం తదితర గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యంపై కప్పిన కవర్లపై వర్షపు నీరు నిల్వడంతో.. నీటిని తొలగించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మరి కొందరు తడిసిన ధాన్యం ఆరబెడుతూ కనిపించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యాన్ని త్వరగా కాంటా చేసి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు. మండలంలో 34.05 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ అశోక్ పేర్కొన్నారు.

మదనాపురం: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా కురిసిన వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందు జాగ్రత్తగా వర్షాలను గమనించి ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పినా.. ఈదురు గాలుల దాటికి అవి ఎగిరిపోవడంతో ధాన్యం తడిసిపోయిందని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. అజ్జకొల్లు ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద వరి ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు వచ్చి చేరింది. కొత్తపల్లి, దుప్పల్లి గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పోసిన వరి కుప్పలకు వర్షపు నీరడంతో పాటు ధాన్యం కొట్టుకుపోతున్నా రైతులు చూస్తు ఉండాల్సిన పరిస్థితులు దాపురించాయి.

గోపాల్‌పేట: వరిపంటలు చేతికొచ్చి ధాన్యం అమ్మే సమయంలో ప్రతిరోజూ మేఘాలు కమ్ముకోవడం, రాత్రికిరాత్రి వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి మేఘాలు కమ్ముకుని ఉండటంతో రైతులు ముందస్తుగా ధాన్యంపై కవర్లు కప్పుకున్నారు. కానీ రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో శనివారం ఉదయం వరకు గోపాల్‌పేట మండల కేంద్రంతో పాటు తాడిపర్తి, బుద్దారం, ఏదుట్ల, ఏదుల, చాకల్‌పల్లి, రేవల్లి, ఇతర గ్రామాల్లోని రైతులు కవర్లు కప్పినా ధాన్యం తడిసిపోయింది. గోపాల్‌పేట మండలంలో 33.0, రేవల్లిలో 10.8 ఎంఎం వర్షం కురిసిందని అధికారులు వెల్లడించారు. గోపాల్‌పేట మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో కాంటా అయిన వడ్ల సంచులు సైతం తడిసి పోయాయి. అక్కడున్న మహేష్ అనే రైతును సాక్షి పలుకరించగా కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి సుమారు 15 రోజులు అయిందని, శుక్రవారం కాంటా వేసినా.. లారీలు రాకపోవడంతో అక్కడే నిల్వ ఉంచాల్సిన వచ్చిందని వాపోయారు. లారీలు వచ్చి ఉంటే ఇప్పటికే సగం ధాన్యం మిల్లులకు వెళ్లేదని, రైతులకు ఈ కష్టాలు ఉండేవి కావన్నారు.



మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతులు



పాన్‌గల్‌లో..



అజ్జకొల్లు ఐకేపీ సెంటర్ వద్ద నిలిచిన వర్షం నీరు



గోపాల్‌పేటలో తడిసిన ధాన్యం బస్తాలు

క్లుప్తంగా

గాలివానకు విరిగిన చెట్లు



అమరచింత: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం వీచిన భారీ ఈదురు గాలులు, వర్షాలకు భారీ చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. దీంతో తీగలు తెగిపడి విద్యుత్ అంతరాయం నెలకొంది. వర్షాల కారణంగా వరిపైర్లతో పాటు మామిడి తోటల్లో కాయలు రాలిపడ్డాయి. వరి కుప్పలను రహదారులపై ఏర్పాటు చేసుకున్న రైతులు వరి ధాన్యం తడవకుండా పాలిథిన్ కవర్లు కప్పిన ధాన్యం ఎక్కడ తడిసి పోతుందోనని ఆందోళనకు గురయ్యారు. కొత్తతండాలో భారీ చెట్లు విరిగి పడ్డాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్థికసాయం అందజేత



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో గుండెపోటుతో మృతిచెందిన బోయరాజు కుటుంబానికి డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి పంపించిన రూ.5వేల ఆర్థికసాయాన్ని శనివారం బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేసి పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతురెడ్డి, బోయ విష్ణు, అశోక్, స్వామి, ఎల్లయ్య, ఈశ్వర్, కుర్మయ్య, బీరయ్య పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



కొత్తకోట రూరల్: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు వరిధాన్యం తడుస్తుండటంతో రైతులకు భరోసానిచ్చేందుకు పెద్దమందడి తహసీల్దార్ సంధ్య శనివారం కొనుగోలు కేంద్రాల్లో గల వరిధాన్యాన్ని పరిశీలించి రైతులకు ధైర్యానిచ్చారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం కుప్పలపై కవర్లు కప్పాలని సూచించారు. మండలంలో తేలికపాటి వర్షపాతం నమోదయ్యిందని, పెద్దగా వరిధాన్యం తడవలేదని తహసీల్దార్ పేర్కొన్నారు. తూకం చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా తరలించాలని మహిళా సమాఖ్య సీసీలకు, పీఏసీఎస్ సిబ్బందికి సూచించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ధైర్యంగా ఉండాలన్నారు.

ఉద్యోగుల సేవలు మరువలేనివి



వనపర్తి టౌన్: విధి నిర్వహణను నిబద్ధతతో నిర్వర్తించే ఉద్యోగుల సేవలను సహచరులు, ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు కాంతారెడ్డి, ఎంఎం రెడ్డి, శ్రీహరి శనివారం పదవి విరమణ పొందడంతో వారిని ఆర్టీసీ డిపోలో పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పరమేశ్వరి మాట్లాడుతూ.. ఆర్టీసీని అగ్రగామిగా నిలపడంలో ఉద్యోగులు, కార్మికుల సేవలు మరువలేనివన్నారు. ఉద్యోగులను, కార్మికులను ప్రయాణికులకు చేరువ చేసేందుకు ఆర్టీసీ సరికొత్త పంథాలో రోజురోజుకూ ముందుకెళ్తుందని చెప్పారు.

ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష

వనపర్తి టౌన్: నవోదయ జవహర్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఏ, బీ సెంటర్లు, బాలుర ఉన్నత పాఠశాల, హరిజనవాడ ఉన్నత పాఠశాలలో ఉదయం 11గంటల 30నిమిషాల నుంచి 1:30 నిమిషాల వరకు పరీక్షను నిర్వహించారు. మొత్తం 1,155 మంది విద్యార్థులకు గాను 1,053 మంది విద్యార్థులు హాజరుకాగా, 102 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి మధుకర్, నవోదయ పాఠశాల బాధ్యులు పర్యవేక్షించారు.

జేఈఈలో ప్రవేశ పరీక్షలో విద్యార్థి ప్రతిభ



పెబ్బేరు: ఆల్ ఇండియా జేఈఈ 2023 (బీఈ/బీటెక్) శనివారం వెలువడిన ఫలితాల్లో 99.76 మార్కులతో సూగూర్‌కు చెందిన బొల్లు శరత్‌చంద్ర యాదవ్ మొదటి ర్యాంక్ సాధించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తండ్రి బొల్లు హుస్సేన్ పెబ్బేరులోని కిష్టారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా.. తల్లి వరలక్ష్మి కొత్తకోట కస్తూర్బా గాంధీ పాఠశా లలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. శరత్‌చంద్రను గ్రామస్తులు అభినందించారు.

క్రమబద్ధీకరణ చేసే వరకు ఉద్యమిస్తాం



నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

వనపర్తి: తమ న్యాయమైన డిమాండ్ ఉద్యోగ క్రమబద్ధీకరణపై ప్రభుత్వం స్పందించి ఉత్తర్వులు ఇచ్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలంగాణ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు మల్లయ్య, వెంకటేష్, రవితేజ, రాఘవేందర్, వినేష్ స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలోని ధర్నాచౌక్‌లో రెండో రోజు సమ్మె శిబిరంలో నిరసన వ్యక్తం చేశారు. వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీబావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 187 మంది జేపీఎస్‌లు పాల్గొన్నారు.

కార్మికుల పొట్ట కొట్టే చర్యలొద్దు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అమరచింత: మే1 నుంచి నిర్వహించే మేడే ఉత్సవాల్లో కార్మికులు పాల్గొని మేడే సంబురాలను జయప్రదం చేయాలని సీపీఐ ప్రజాపంథా డివిజన్ నాయకుడు రాజు, మండల కార్యదర్శి రాజన్న కోరారు. పట్టణంలోని మార్క్స్ భవనంలో శనివారం మేడే ఉత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు రోజువారి 8 గంటల పనిదినాల కోసం యాజమాన్యంతో పోరాడి అసువులు బాసిన అమరుల జ్ఞాపకార్థం ప్రతి ఏడాది మేడే సంబురాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చేందుకు యత్నిస్తుందని, వాటిని కార్మికులందరూ సంఘటితంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు కురుమన్న, జీలాని. బీమన్న, ప్రేమరత్నం, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకే ‘అమృత్ సరోవర్’

- చెరువులు, కుంటల బలోపేతం
- అమృత్ సరోవర్ పనులు పరిశీలించిన డీఆర్‌డీఓ



పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నర్సింహులు

పాన్‌గల్: గ్రామాల్లో చెరువులు, చిన్న నీటి కుంటలను అభివృద్ధి చేసి భూగర్భ జలాలను పెంపొందించేందుకే అమృత్ సరోవర్ పథకం ప్రవేశపెట్టినట్లు డీఆర్‌డీఓ నర్సింహులు అన్నారు. శనివారం గోప్లాపూర్‌లోని మంగమోనికుంటలో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపిక చేసిన చెరువులు, కుంటల్లో ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించి మరమ్మతు పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పనుల వలన నీటి నిల్వలు పెరిగి భూగర్భ జలాలు వృద్ధితో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ఈ పథకం ద్వారా చెరువులు, కుంటల్లో ఒండ్రు మట్టిని తవ్వడం, తవ్విన మట్టిని పంట పొలాలకు తరలించడం, కట్టలను బలోపేతం, కట్టలపై పెరిగిన ముళ్ల పొదలను తొలగించడం వంటి పనులు చేపడతారన్నారు. ఉపాధి కూలీలకు కనీస పనిదినాలు లభించేలా పనులు చేపట్టడం, జాతీయ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ పురోగతిని కేంద్ర ప్రభుత్వ సర్వర్‌కు అనుసంధానించి వేగంగా పనులు జరిగేలా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఏపీఓ కుర్మయ్య, సర్పంచ్ రాణి, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి



అమరచింతలో మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: మహిళలు కుటుంబ పోషణలో పురుషులతో సమానంగా ఆర్థిక పురోగతి సాధించాలని, అప్పుడే కుటుంబం అన్ని రంగాల్లో విజయం సాధిస్తుందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నాల్గో, ఐదో వార్డులకు చెందిన మహిళలకు మెర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన కుట్టుమిషన్లను శనివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ నుంచి కుట్టులో శిక్షణ పొందిన 46 మంది మహిళలకు మిషన్లు అందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, కౌన్సిలర్ రాజ్‌కుమార్, కోఆప్షన్ అడ్వకేట్ రాజేందర్, రమేష్, నరసింహులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కొత్తదనం

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జాతర మైదానంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి ద్వార మంజూరైన రూ.90 లక్షల నిధులతో చేపట్టే అదనపు తరగతి గదుల నిర్మాణాలకు శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేశ్వర్, డీఈ శ్రీనివాసులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగుల జీవితాలు ఆగం



అమరచింతలో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి

అమరచింత/ఆత్మకూర్: తెలంగాణ వస్తే తమ బతుకుల మారుతాయని సంతోషపడిన నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా సీఎం కేసీఆర్ వారి జీవితాలను ఆగం చేస్తున్నాడని, కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలంటూ మోసం చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, నారాయణ పేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో నిర్వహించిన మండల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను ఎండగట్టారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ మహబూబ్‌నగర్‌లో ఆదివారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీకి యువత పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, అమరచింత, ఆత్మకూర్ మండలాల అధ్యక్షులు పరమేష్, మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు నల్గొండ శ్రీను, అరుణ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న, రహ్మతుల్లా, శ్యాం, నాగూనాయక్, పోసిరిగారి విష్ణు, లక్ష్మీకాంత్‌రెడ్డి ఉన్నారు.

పెబ్బేరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో టీపీసీసీ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టనున్న నిరుద్యోగ నిరసన ర్యాలీ విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎనుముల రేవంత్‌రెడ్డి, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ చిన్నారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల నోటిఫికేషన్ల పేరుతో యువతను మోసం చేస్తున్నాయని దుయ్యబట్టారు.

పెబ్బేరు రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించే నిరుద్యోగ ర్యాలీని జయప్రదం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములుయాదవ్ కోరారు. ఈ సందర్భంగా శనివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత జీవితాలను అంధకారంలోకి నెడుతుందని మండిపడ్డారు. మండలంలోని నిరుద్యోగ యువకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రభుత్వాన్ని గద్దెదించాలి

మదనాపురం: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి కృష్ణవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మట్లాడుతూ.. ర్యాలీకి ముఖ్య అతిథిగా టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిరుద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా యువకులు, కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాంచంద్రయ్య, మండల ప్రధాన కార్యదర్శి జగదీష్, వేమన, సత్యశీలారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ ఏజెన్సీని రద్దు చేయాలి



డాక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సురేష్

ఆత్మకూర్: వేతన ధనాన్ని దిగమింగుతున్న వెంకటయ్య మెడికల్ ఏజెన్సీని రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య భద్రత, పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికుల సగటు వేతన ధనాన్ని కాజేస్తున్న వెంకటయ్య సెక్యూరిటీ ఏజెన్సీని తక్షణమే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి రద్దు చేయాలని కోరారు. కార్మికులకు చట్టబద్ధత కల్పించాలని, వారి వేతనాల్లో కోతలను తగ్గించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి కార్మికులు నాగమ్మ, తిరుపతమ్మ, పార్వతమ్మ, బాలకిష్టమ్మ, చెన్నమ్మ, బాలరాజ్, శ్రీకాంత్, మైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రీబటన్ టైర్ల షాపులో పేలుడు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఇసాక్ రీబట్టన్ టైర్ల షాపులో శనివారం పేలుడు జరగడంతో ఇసాక్‌కు తీవ్రగాయాలైన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం టైర్ల రీబటన్ కోసం కట్టెలతో మంటల పెట్టి హీట్ చేస్తున్న క్రమంలో మీటర్ పనిచేయకపోవడంతో ఒకసారి శబ్దంతో భారీ పేలుడు రావడంతో అక్కడి ఉన్న ఇసాక్‌కు తీవ్ర గాయాలు కావడంతో పాటు చుట్టు పక్కల ఉన్న ఉప్పరి రాములు ఇల్లు దెబ్బతింది. గాయపడిన ఇసాక్‌ను చికిత్స కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎస్‌ఐ జగదీశ్వర్‌ను వివరణ అడుగగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పెబ్బేరు: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మే 7న నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభకు సంబంధించిన పోస్టర్లను శనివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ జాతీయ పార్టీ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వనపర్తి అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి గూడెం ఎల్లస్వామి మాట్లాడుతూ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర అధ్యక్షుడయిన తర్వాత మొదటిసారిగా తెలంగాణకు వస్తున్న మాయావతికి భారీ ఎత్తున బహుజనులు స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాంబాబు, సుజాత, అరుణ్, రామచంద ర్, భరత్, వేణు, కార్తీక్, అరుణ్, ఆనంద్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఖిల్లాఘనపురం: మండలంలోని అంతాయపల్లికి చెందిన రాంరెడ్డి అనారోగ్యం బారిన పడడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిశారు. స్పందించిన ఆయన చికిత్స నిమిత్తం రూ.2లక్షల ఎల్‌ఓసీని శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపత్కాల సమయంలో ఆదుకున్న మంత్రికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



మదనాపురంలో భిక్షాటన చేస్తున్న వీఓఏలు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, వీఓఏల సమస్యలను పరిష్కరించడంలో సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తుందని, తమ కుటుంబాలు వేతనాలు లేక వీధిన పడే పరిస్థితులు దాపరించాయని వీఏఓలు శనివారం భిక్షాటన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఆత్మకూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో అక్కడికి వస్తున్న వారితో భిక్షాటన చేపట్టారు. కార్యక్రమంలో ఇంద్రావతి, కురుమూర్తి, బాలస్వామి, రవి,పావని, రంగన్న , పావని, రంగన్న, రాధ పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలో శనివారం వీఓఏలు భిక్షాటన చేపట్టారు. వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో 13 రోజులుగా నిరవధిక సమ్మెలో భాగంగా హోటళ్లు, కిరాణాలు, ప్రభుత్వ కార్యాలయాలకు తిరుగుతూ వారు భిక్షాటన చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, వీఓఏల సంఘం అధ్యక్షురాలు అలివేల, ఉపాధ్యక్షులు మన్యం, కార్యదర్శి స్వప్న, సహాయ కార్యదర్శి రజిత, కోశాధికారి జమ్మన్న, పద్మ, అరుణ, రాజేశ్వరి, నారాయణ, రాజశేఖర్, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట తమ డిమాండ్ల సాధన కోసం వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతామన్నారు. సమ్మెలో సంఘం నాయకులు రాజయ్యగౌడు, శ్రీనివాసులు, భాగ్యమ్మ, స్వరూపరాణి, బాలరాజు, నరేష్, శేషయ్య, కృష్ణయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.